నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

09 ఫిబ్రవరి 2026 పేజీలు : 08




# నగరబాట పట్టిన జనం

- అంచనా వేయని అధికార గణం
- పెరుగుతున్న వలసలు
- గ్రామాల్లో తగ్గుతున్న ఉపాధి






నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎక్కువ శాతం నగర బాట పట్టారు. ముఖ్యంగా పేదలు, నిరుద్యోగ యువతకి ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది నెల్లూరు నగరం, గూడూరు లాంటి పట్టణాలకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా జిల్లా లోని రాపూరు, కలువాయి, దాచూరు, అనంత సాగరం, పొదలకూరు, చేజర్ల, సైదాపురం, మనుబోలు, ఉదయగిరి, మర్రిపాడు పలు ప్రాంతాల నుంచి వలసలు ఎక్కువైనట్లు సమాచారం. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా లేకపోవడంతో ఎక్కువ శాతం వలస బాట పట్టినట్లు సమాచారం. అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలను గుర్తించి, వారికి జాబ్‌కార్డులు కల్పించకపోవడం, కొంతమందికి జాబ్ కార్డులు ఉన్న వారికి ఉపాధి చూపకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం చాలామంది నగర, పట్టణ ప్రాంతాలకు వెళ్లి జీవనోపాధి పొందవలసిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో కరువు పనులు అధికారులు చేపట్టకపోవడంతో గ్రామాల్లో ప్రజలు చాలావరకు వలసబాట పడుతున్నారు. గతంలో మండలాల్లో ఉన్న జనాభా ప్రస్తుతం ఆయా మండలాల్లో చాలావరకు తగ్గుముఖం పట్టిందని చెప్పవచ్చు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలు ఉన్నప్పటికీ అధికారులు గ్రామీణ ప్రాంత ప్రజలను గుర్తించి వారికి అవసరమైన ఉపాధి చూపవలసి ఉంది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ఉపాధి అవకాశాలు చెబుతున్నప్పటికీ, కొందరు అధికారులు వారిని గుర్తించకపోవడంతో చాలామంది యువత పనుల కోసం నెల్లూరు నగరానికి వచ్చి పనులు చేసుకొని సాయంత్రానికి వారు ఉండే ప్రాంతానికి చేరుకుంటున్నారని తెలిసింది. అదేవిధంగా చాలా మంది మండల స్థాయి అధికారులు వారు ఉండే ప్రాంతాల్లో ఉండకపోవడం హడావుడిగా రావడం,

-మిగతా 2లో

# శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రులు ఆనం, నారాయణ



నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :

నగరంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన మూలాపేటలో శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం అత్యంత అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న మంత్రులకు అర్చకులు పూర్ణకుంభంతో

-మిగతా 2లో

# నరకానికి రహదారి.. ఈ దారి

- సైదాపురం టు దేగపూడి రోడ్డుకు మోక్షం ఉందా ?
- ప్రమాదకరంగా మారిన రోడ్డు ప్రయాణం
- దినదిన గండంగా బతుకుతున్న మండల ప్రజలు



అమ్మతోడు.. ఈ రోడ్డుపైన తట్ట మట్టివేస్తే ఒట్టు. అందరం అయిదేళ్లకు ఓసారి ఓట్లు వేస్తాం.. అదే మనం చేసుకున్న పాపంలా కనిపిస్తోంది. ఈ ప్రాంతం పొదలకూరు నుంచి గూడూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి. నిమ్మ వ్యాపారస్తులు ఎక్కువ.. మైకా ఉండేది ఈ ప్రాంతంలోనే. ప్రసిద్ధ శైవక్షేత్రాలు సిద్దలయ్య కోన, తలుపూరు శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం ఈ ప్రాంతం లో ఉంది. నిమ్మ రైతులకు పొదలకూరు, గూడూరు ప్రాంతాలలో మార్కెట్‌యాడ్ ఉండటంతో ఈ రహదారి రాకపోకలతో ఎంతో బిజీగా ఉంటుంది. పదేళ్ల నుంచి ఈ రహదారి గుంతమయం.. ప్రమాద భరితంగా ఉంది. ఒక్కరు పట్టించుకుంటే ఒట్టు. ఎంతమంది ప్రమాదానికి గురవు తున్నారో.. ఓసారి ఈరోడ్డు వైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు చూస్తే అవగతమవుతుంది. వివరాలిలా ఉన్నాయి.

సైదాపురం, మేజర్‌న్యూస్ :

సైదాపురం నుండి దేగపూడి రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలకే పరిమితమైంది. టీడీపీ ప్రభుత్వం వచ్చి దాదాపు 2 సంవత్సరాలు కావస్తున్నా.. రోడ్డు వేసిన దాఖలాలు లేకపోవడంతో ప్రజలు విసిగిపోయారు. అప్పట్లో ప్రభుత్వం మారితే మా గ్రామాల రోడ్లు బాగుపడతాయని అనుకున్నప్పటికీ.. ప్రభుత్వం మారినా ప్రజలకు నిరాశ మిగిలింది. ప్రధాన రహదారి ఇంత అధ్వానంగా తయారైనప్పటికీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ, ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పుడు కూడా ప్రజలు పక్షాన ఉన్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈసారి ఎందుకో కానీ, తమ మండలం వైపు చూడటం లేదని, ఇబ్బందులు గుర్తించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-మిగతా 2లో

# మూలపేట బాలికల హైస్కూల్‌కు కార్పొరేట్ హంగులు

- రూ.10 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో డీఎస్‌ఆర్ గ్రూప్ చేపట్టిన పనులను పరిశీలించిన మంత్రి నారాయణ
- నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి
- జూన్‌లో ప్రారంభోత్సవానికి ముస్తాబు




నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

నగరంలో ప్రభుత్వ విద్యారంగం రూపురేఖలు మారుతున్నాయి. మూలాపేట ప్రాంత విద్యార్థినులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించాలనే లక్ష్యంతో డీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిర్మితమవుతున్న బాలికల ఉన్నత పాఠశాల నూతన భవన పనులను మంత్రి పొంగూరు నారాయణ

-మిగతా 2లో

## మసీద్ నిర్మాణానికి
# రూ.62 వేలు ఆర్థిక సహాయం

మర్రిపాడు, మేజర్‌న్యూస్ : మర్రిపాడు మండలం నాగినేనిగుంట గ్రామంలో నిర్మిస్తున్న మసీద్ కోసం దూదేకుల సంఘం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల సహకారంతో రాష్ట్ర దూదేకుల సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ సలీమ్ రూ.62,500లను సీనియర్ నాయకులు రాయపాటి సిద్దయ్యకు అందజేశారు. భవిష్యత్‌లో మసీద్ అభివృద్ధికి జిల్లా దూదేకుల సంఘం కృషి చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా దూదేకుల నాయకులు షేక్ మహబూబ్ బాషా, షేక్ మస్తాన్ (అగ్ని), డాక్టర్ మీరావలి, షేక్ షరీఫ్, షేక్ మౌలాలి, షేక్ మస్తాన్ సాహెబ్, షేక్ పీరయ్య, షేక్ హజరత్, షేక్ రంతుల్లా, మస్తాన్ వలి, షేక్ మహమ్మద్ (డిసి పల్లి) తదితరులు పాల్గొన్నారు.



## మూలపేట బాలికల హైస్కూల్‌కు కార్పొరేట్ హంగులు



(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియతిరిగిన మంత్రి, పనుల వేగం, క్వాలిటీ పట్ల తన పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అత్యంత ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న ఈ భవనాన్ని రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి, అంటే జూన్‌కల్లా పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు, ఆటాపాటలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామన్నారు. గడువులోగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కృషితో పాటు డీఎస్ఆర్ ఫౌండేషన్ వంటి సంస్థల సేవా దృక్పథం తోడవ్వడం వల్ల మూలపేట స్కూల్ జిల్లాలోనే ఒక మోడల్ స్కూల్‌గా నిలవబోతోందన్నారు. కార్యక్రమంలో కమీషనర్ నందన్, ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ తాళ్ళపాక అనూరాధ, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## నగరబాట పట్టిన జనం

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రానికి వారు ఉండే పట్టణ ప్రాంతాన్ని చేరుకుంటూ ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వలస బాట పట్టారు. ఆయా మండలాల్లో అధికారులు నిరుద్యోగ యువతను గుర్తించలేకపోతున్నారని పలువురు అంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు చాలాచోట్ల అనుకున్న విధంగా జరగకపోవడంతో, నిరుద్యోగ యువత సొంతంగా వారే ఉపాధి పొందేందుకు నగర బాట పట్టారు. దీంతో అక్కడ ఆటోలు నడుపుతూ.. ఇతర పనులకు వెళ్తూ కాలం గడుపుతున్నారు. వీరివల్ల నెల్లూరు నగరం రోజురోజుకు విస్తరిస్తూ జనాభా పెరిగిపోతున్నారు. చాలా మంది షాపుల్లో, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇకనైనా అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వలసలు పోకుండా నిరుద్యోగ యువతకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



(మొదటి పేజీ తరువాయి)

ఘనస్వాగతం పలికారు. భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. మంత్రుల సమక్షంలో నూతన చైర్మన్‌గా పుట్టా అజయ్‌కుమార్ రెడ్డి, పాలకమండలి సభ్యులుగా పెంట్యాల శైలజ, యర్రం శెట్టి సుధీర్‌బాబు, కనియంపాటి లీల, సూరిశెట్టి ఉషారాణి, జొన్నలగడ్డ హేమచంద్ర, దువ్వూరు నరేంద్ర, యందోటి పోలమ్మ, రాజు కృష్ణ, నవులూరు శ్రీకృష్ణ, పొలిచెర్ల విజయమ్మ, వందవాసి శివకుమార్ గురుకుల్ (ఎక్స్ అఫీషియో ధర్మకర్త) సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులు తమ పదవిని ఒక బాధ్యతగా భావించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ అధికారులు ఆగమ విధానాల్లో జోక్యం చేసుకోకూడదని, పండితుల సూచనల మేరకే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. త్వరలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నూతన కమిటీని కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 15 నుండి ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆలయ కోనేరు అభివృద్ధికి రూ. 6.80 కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, మంత్రి ఆనం సహకారంతో నగరంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

### వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంపై సమీక్ష

అనంతరం మంత్రులు మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ.16.70 కోట్లతో జరుగుతున్న ఈ నిర్మాణ పనుల డిజైన్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. 'ఆరు నెలల క్రితం చినజీయర్ స్వామి వారు ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ప్రధాన ఆలయంతో పాటు నరసింహస్వామి ఆలయ ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి. ఆలయం చుట్టూ నాలుగు వైపులా మాడవీధులను ఏర్పాటు చేస్తున్నాం. నాణ్యతతో కూడిన పనులను వేగవంతం చేసి, మరో 18 నెలల్లో ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని మంత్రులు వెల్లడించారు.

చివరగా.. వేణుగోపాలస్వామిని దర్శించుకున్న మంత్రులు, ఆలయ నిర్మాణాన్ని శాస్త్రోక్తంగా, నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని భక్తులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు స్థానిక టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నరకానికి రహదారి.. ఈ దారి !



(మొదటి పేజీ తరువాయి)

పదేళ్లు గడుస్తున్నా.. ఎవరూ కూడా సైదాపురం-దేగపూడి ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడంతో ఆ రహదారి అంతా గుంతలుగా మారి వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లె పల్లెకు రోడ్డు వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెబుతున్నప్పటికీ.. మన వెంకటగిరి నియోజకవర్గంలో రోడ్లకు మాత్రం మోక్షం కలిగే పరిస్థితి లేదు. ఈ నియోజకవర్గంలో సూపర్ ఎమ్మెల్యే అయిన అమ్మకరణ చూపిస్తే రోడ్డుకు మోక్షం లభించదని పలువురు చెబుతుండటం విశేషం. ఈ నియోజకవర్గంలో అడుగు పెట్టాలన్నా.. రోడ్డు వేయాలన్నా.. రోడ్డుపై మట్టి వేయాలన్నా.. అమ్మ పర్మిషన్ ఉండాలి. వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే సైతం ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సైదాపురం నుండి పొదలకూరు వైపు వెళ్లే రోడ్డు నిత్యం రైతుల రాకపోకలతో ఎంతో రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ముఖ్యంగా నిమ్మ రైతులు ఎక్కువ మొత్తంలో కలిగి ఉంటారు. అంతేకాకుండా సైదాపురం మండలం మైనింగ్ ఏరియా కావడంతో వాహన రాకపోకలు అధిక మొత్తంలో కనిపిస్తూ ఉంటాయి. ఈ ప్రాంతం సైదాపురం నుంచి దేగపూడి వరకు ఉన్న రోడ్డు 20 కిలోమీటర్ల వరకు ఎంతో ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉండడంతో నిమ్మ రైతులు, వాహనదారులు గత పది ఏళ్లుగా నరకమంటే ఏమిటో చవిచూస్తున్నారు. దాదాపు 500 ఎకరాలకు పైగా ఈ ప్రాంతంలో నిమ్మ రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న నిమ్మ రైతులు తమ నిమ్మకాయలను మార్కెట్లకు తరలించేందుకు ఎక్కువగా గూడూరులోని నిమ్మ మార్కెట్‌కు తరలిస్తుంటారు. అలాగే మిగిలిన వరి, రకరకాల పంటలు కలిగిన రైతులు తమ వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ఎంతో కీలకమైంది. దీనికి తోడు ఇక్కడ మైనింగ్ ఉండడంతో మైనింగ్ కంపెనీలుండటం, అధిక లోడ్‌తో లారీలు వెళ్తుండటం జరుగుతుంటాయి. అలాగే ఎంతో పవిత్రత కలిగిన తలుపూరులో వెంకయ్యస్వామి ఆశ్రమం ఉండడం.. ఆయన శిష్యులు స్వామి సమర్థ సద్గురు నారాయణస్వామి ఇప్పటికీ సజీవులుగా ఉండి భక్తులను ఆశీర్వదించడం.. తలుపూరు ఒక దివ్య క్షేత్రంగా వెలుగొందడంతో భక్తులు రాకపోకలు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. పవిత్ర పుణ్యక్షేత్రమైన సిద్దలయ్య స్వామి పుణ్యక్షేత్రం కూడా ఎంతో ప్రసిద్ధిగాంచింది, అలాంటి పుణ్యక్షేత్రాలకు ఈ ప్రధాన రహదారి గుండానే భక్తులు రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డు నిర్మాణం దారుణంగా ఉండడంతో ప్రయాణీకులు కాలినడకన పోవడానికి కూడా చాలా కష్టంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో సైదాపురం మండలానికి సంబంధించి సైదాపురం-దేగపూడి వరకు రూ.45 కోట్లతో ఈ రహదారి నిర్మాణానికి అనుమతులు వచ్చినప్పటికీ.. ఈ రహదారి వేయటంలో కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యం వహించారో అర్థం కాని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలోనే కలిచేడు బస్టాండ్ సెంటర్లో గత ఆర్అండ్‌బి అధికారి గిరికుమార్ ఉన్న హయాంలో సిమెంట్ రోడ్డు వేశారు. ఆ తరువాత ఈ రోడ్డు నిర్మాణమనేది అకాలంగా ఆగిపోయింది. అప్పటి పని చేస్తున్న ఆర్అండ్‌బి ఏఈ గిరి వివరణ అడగగా.. తాను మెడికల్ లీవ్‌లో వెళ్లానని, అందువల్ల తాను రోడ్డు నిర్మాణంలో లేకపోవడంతో కొన్నాళ్లు రోడ్డు పనులకు అంతరాయం కలిగిందని తెలిపారు. ఈ టెండర్ వేసిన వ్యక్తి ప్రభుత్వం మారగానే.. సీఎం చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో ఇచ్చిన టెండర్ల విషయంలో కొంత స్వల్ప మార్పులు చేశారు. దీంతో టెండరుదారు హడావుడిగా మెయిన్ బస్టాండ్ దగ్గర సిమెంట్ రోడ్డు పూర్తి చేశారు. ఆ తర్వాత సైదాపురం నుండి 5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం చేశారు. మిగిలిన రోడ్డును నిలిపివేయడంతో మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం వస్తే మాత్రం ఈ మార్గంలో పోయే వాహనదారులకు, రైతులకు నరకంగా ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మోక్షం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జనహిత వాత్సల్య హోమ్‌కు నిత్యవసర సరకులు అందజేత



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లాకేంద్రమైన నెల్లూరు వనంతోపు సెంటర్ నందు ఆదివారం జనహిత వాత్సల్య చిన్నారుల వృద్ధుల ఆశ్రమ నందు శిరిగి రెడ్డి అనిత పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావుకు నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపి హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ.. కరోనా కష్టకాల సమయం నుండి ప్రజల్లో చాలా మార్పు వచ్చిందని తోటి వారిని ఆదుకునే తత్వం పెరిగిందని, ఈ క్రమంలో అనేకమంది ప్రభుత్వ ప్రైవేటు అధికారులు ఉద్యోగులు ముందుకు వచ్చి అనాథ బిడ్డల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నారని, మానవ సేవయే మాధవ సేవలో సభ్యులుగా ఉంటూ శిరిగి రెడ్డి అనిత అమెరికాలో నర్సింగ్ ఆఫీసర్ గా సేవలందిస్తూ వారి జన్మదినం సందర్భంగా జనహిత వాత్సల్య చిన్నారులకు నిత్యావసర సరకులు అందించడంతోపాటు, వాత్సల్య ఆశ్రమం నందు పిల్లలకు విద్యాభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందిస్తానని, తన తోటి వారి ద్వారా కూడా సహాయ సహకారాలు ఉండేటట్లు చూస్తానని చెప్పడం అభినందనీయమని, గతంలో ఏపీ కమ్యూనిటీ హెల్త్ హెల్త్ ఆఫీసర్స్(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుగా కూడా మంచిగా వ్యవహరించారని, సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తూ వస్తున్న వారి భర్త భరత్‌కి వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా టీం నిర్వాహకులు అరవ పరిమళ, విజయమ్మ, లక్ష్మీకాంతమ్మ, మంజరి తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా అందుబాటులో ఉండండి



**జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల**

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈరోజు నాకు చాలా ప్రత్యేకమైన రోజు. నమ్మిన ఆశయం కోసం కులమతాలు దాటి, రక్త సంబంధం లేకపోయినా హృదయ సంబంధంతో అన్నదమ్ములుగా కలిసి నడిచిన నా తమ్ముడు జొన్నలగడ్డ హేమచంద్ర యాదవ్ శివాలయం దేవాలయ కమిటీ మెంబర్‌గా ఎన్నిక కావడం నాకు అపారమైన ఆనందాన్ని ఇచ్చిందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హేమచంద్ర యాదవ్ పదవుల కోసం రాజకీయాలు చేయరు.. బాధ్యత కోసం పని చేసే వ్యక్తి. సమాజం, ధర్మం, పార్టీ ఈ మూడు విలువలను కలిపి నడిచే నాయకుడు. అలాంటి వ్యక్తికి ఈ గౌరవం రావడం సహజ మన్నారు ఈ అవకాశాన్ని కల్పించిన నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణకి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పర్యవేక్షకులు, ఏపీ టీడీపీ చైర్మన్ అజయ్ చొరవ అభినందనీయం. కూటమి ప్రభుత్వంలో అర్హత ఉన్నవారికి అవకాశం లభిస్తుందనే దానికి ఇది నిదర్శనమన్నారు. మనం ఎక్కడ ఉన్నా, ఏ పదవిలో ఉన్నా, మన ప్రవర్తన పవన్ కళ్యాణ్ ప్రతిష్టను పెంచేదిగా ఉండాలి. పదవి చిన్నదైనా సేవ పెద్దదిగా ఉండాలి. అధికారం తాత్కాలికం. కానీ మన పని శాశ్వత గుర్తింపు తీసుకువస్తుంది. ఈ శివాలయం ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆలయం. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయం కొత్త కమిటీ సారథ్యంలో, కూటమి పర్యవేక్షణలో మరింత అభివృద్ధి చెంది భక్తులకు ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా మారాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. హేమచంద్ర యాదవ్ ఈ బాధ్యతను ఒక పదవిగా కాదు ఒక ధార్మిక వ్రతంగా స్వీకరించాలని కోరుతున్నాను ఆలయ పరిరక్షణ, అభివృద్ధి, పారదర్శకత ఇవే మీ లక్ష్యాలుగా ఉండాలి. చైర్మన్ పుట్టా అజయ్‌కి నూతన కార్యవర్గ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ధర్మ పరిరక్షణలో, భక్తుల సేవలో ముందుండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 12వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని 17వ డివిజన్ అపోలో సెంటర్లోని రోడ్డు మార్జిన్ కార్మికుల ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. అలాగే ఈ సందర్భంగా సిఐటి రూరల్ అధ్యక్షులు ఎం.సుధాకర్ రోడ్డు మార్జిన్ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికులు స్వాతంత్రానికి ముందు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌గా చేయడం జరిగింది. నాలుగు లేబర్ కోడ్స్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయి. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం 12 గంటలకు పెంచబడింది సమ్మె చేసే హక్కు లేదు యూనియన్ పెట్టుకునే హక్కు హరించి వేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 12వ తేదీ సమ్మె సందర్భంగా ఏబీఎం కాంపౌండ్ నుంచి సిఐటియు అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరుగుతుంది కావున కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాద్, చాంద్ బాషా, శ్రీధర్ పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి స్వర్ణపతకం సాధించిన విద్యార్థిని

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం బట్టేపాడు ఉన్నతపాఠశాలలో 9వతరగతి చదువుతున్న సి.హెచ్.రాణి అనే విద్యార్థిని 49 కెజిల బరువు విభాగంలో రాష్ట్ర స్థాయి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకొని జాతీయస్థాయికి ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్17 విభాగంలో 49కెజిల బరువు కేటగిరిపోటీల్లో పాల్గొన్న రాణి రాష్ట్రస్థాయి స్వర్ణపతకాన్ని పొంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. పి.డి కావాటి వెంకట కృష్ణ ఇచ్చిన శిక్షణతో ఆమె తన ప్రతిభచూపి రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. తమ గ్రామంలో జన్మించి ఇక్కడే చదువుతూ రాష్ట్ర స్థాయి స్వర్ణపతకాన్ని రాణి సాధించడం తమ గ్రామానికే గర్వకారణమని గ్రామస్థులు పలు వురు పేర్కొన్నారు. ఆమె తల్లిదండ్రులు, పి.డి వెంకటకృష్ణయ్య, గ్రామస్థులు రాణిని అభినం దించి జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

# గ్రామ అభివృద్ధిలో జనసేన పాత్ర ఉండాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో జనసేన పాత్ర ఉండాలని మండల జనసేన అధ్యక్షులు మాధవ్ పేర్కొన్నారు. మండలంలోని మినగల్లు గ్రామంలో ఆదివారం స్థానిక నాయకులతో కలిసి నిర్వహించిన జనసేన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని, అలాగే గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రాబోయే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గతంలో కంటే ఎక్కువమంది సభ్యులు సభ్యత్వం తీసుకొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసైనికులు గోవర్ధన్, నాగరాజు, యశ్వంత్, వెంకయ్య, భార్గవ్, వెంకటేష్‌లతోపాటు మండల జనసైనికులు పసుపులేటి సురేష్, తుమ్మల ప్రసాద్, బిట్రా సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సొసైటీ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి మృతి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమన గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సొసైటీ అధ్యక్షులు కాటూరు జనార్ధన్‌రెడ్డి (75) నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకొని బంధువులు స్నేహితులు పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. వివాదరహితుడుగా అందరితో కలుపుగోలుగా ఉంటూ మంచి రాజకీయ నాయకుడిగా పదిమందికి సహాయపడే వ్యక్తిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిది. మేకపాటి కుటుంబం తోను, ఆనం కుటుంబంతోను మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కుటుంబంతోను జనార్ధన్ రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన పార్థివ దేహాన్ని నెల్లూరు నుంచి మధ్యాహ్నం లోపు స్వగ్రామమైన చిరమనకు తీసుకు రానున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బంధువులు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఇప్పటికే పెద్ద ఎత్తున ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు.

# విద్యార్థులకు కాస్మొటిక్స్ అందజేత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులకు శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి కాస్మొటిక్స్‌ను తన స్వంత నిధులతో సమకూర్చి ప్రధానోపాధ్యాయిని సి.హెచ్.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న 'ముస్తాబు' కార్యాక్రమంలో భాగంగా ఆయన విద్యార్థులకు టవల్స్, సబ్బులు, సబ్బుపెట్టెలు, బొట్టుబిళ్ళల ప్యాకెట్లు, దువ్వెనలు, ఫౌడర్ డబ్బాలు తదితరాలను ఆయన పంపిణీ చేశారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరమైన కుర్చీలను కూడా సమకూరుస్తానని భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయనకు ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు టౌన్‌లో నాకాబంది నిర్వహించిన పోలీసులు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా ఎస్పీ అజితా వేజండ్ల ఆదేశాల మేరకు నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రధాన కూడళ్ళలో నాకాబంది నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల తనిఖీని తీవ్రతరం చేసి, గాంజా సేవించడం, నిల్వ, అమ్మకాలు, రౌడీ యిజం, దౌర్జన్యాలు, దోపిడి దొంగతనాల నిర్మూలించాలని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయుటకు ఈ నాకాబంది స్వయంగా నిర్వహించినట్లు టౌన్ ఏఎస్పీ తెలియజేశారు. అదేవిధంగా రౌడీ షీటర్లు, అనుమానస్పద వ్యక్తుల చర్యలపై నిఘ తీవ్రతరం చేసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అంతేకాకుండా ప్రజలు సురక్షితంగా, శాంతియుతంగా నిద్రించేలా చూడడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని, క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, గంజాయి సేవించే, వ్యాపారాలను అరికట్టుటకు, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, ప్రదీప్ ప్రాంతాలలో



అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు గురించి గానీ, రౌడీయిజం గురించి గానీ సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు గాని డయల్ 112 గాని సమాచారం తెలియజేయాలని ఈ సందర్భంగా టౌన్ ఏఎస్పీ దీక్ష ప్రజలకు సూచించారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో జామాయిలు, సవక తోటలు దగ్ధం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలోని మొలకలపూండ్ల గ్రామ పరిధిలో అడుసుమల్లి కమలమ్మకు చెందిన 1.50 ఎకరాల తోటలో జామాయిల్ పంట ఉంది. కమలమ్మ తోట మీదిగా 11 కేజీ కరెంటు వైర్లు ఉండగా జామాయిల్ గాలికి తీగలకు తగలడంతో అక్కడ నిప్పురవ్వలు పడి జామాయిలు కింద భాగంలో ఎండుటకులు ఉన్నటువంటి జామాయిల్‌కు నెమ్మదిగా మంటలు అంట్టుకొని చిన్నచిన్న మొలకలు అన్ని కూడా కాలిపోవడం జరిగింది. అనంతరం ఈ తోటకు ఆనుకొని అడుసుమల్లి రాజయ్య తండ్రి కృష్ణయ్య సవక రెండు ఎకరాలు సాగు చేస్తున్నారు. అయితే జామాయిల్ తోట నుండి ఎగసపడిన మంటలు అడుసుమల్లి రాజయ్య సవక రెండు వరుసలు కాలిపోవడం జరిగింది. అంతేకాకుండా అడుసు మల్లి రాజయ్య తోటకు సంబంధించి కటవ మొత్తం కూడా అగ్నికి ఆహుతి అయింది ఈ ఘటన జరిగిన అరగంటకు గ్రామంలో ఉన్నవారికి మంటలు పొగలు ఎగసపడడంతో గ్రామస్తులు గమనించి ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసి గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. గ్రామస్తులు మంటలను అదుపులోనికి తీసుకొచ్చిన తరువాత ఫైర్ సిబ్బంది వెళ్లి అక్కడ ఉన్నటువంటి నిప్పులను ఆర్పి ఇక ఏ విధమైన ప్రమాదం లేదని గ్రామస్తులకు ఫైర్ సిబ్బంది తెలిపారు.

# బుచ్చిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్థానిక అంబేద్కర్ భవన్లో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి తిరుపతి వారిచే నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆపరేషన్ లు అవసరమైన 25 మందికి మందికి తమ ట్రస్టు తరఫున ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి వారి స్వస్థలాలకు పంపించడం జరుగుతుందని ట్రస్ట్ సీఈవో పి సీతారామ నాయుడు తెలిపారు. ఇప్పటివరకు తమ ట్రస్ట్ తరఫున 5 సార్లు ఇటువంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని, భవిష్యత్తులో భవిష్యత్తులో మరిన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త గండికోట సుధీర్ కుమార్, అరవింద కంటి వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



# నందమూరి బాలయ్య క్యాలెండర్ ఆవిష్కరణ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నందమూరి బాలయ్య చిత్రాలతో కూడిన క్యాలెండర్ను ఆదివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. బాలయ్య అభిమాన సంఘ అధ్యక్షులు షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలిసి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నందమూరి బాలయ్య సినీ రంగంలో తిరుగులేని నటుడుగా ప్రఖ్యాతి చెందాడని తెలిపారు. తండ్రిని మించిన తనయుడుగా ఆయన తన నటన ప్రభావాన్ని ప్రదర్శించారు అంతటి మహానటుని చిత్రాలతో క్యాలెండర్ ఆవిష్కరింప చేయడం అభిమాన సంఘ సభ్యుల సంతోషకరమైన పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు చేబ్రోలు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# 12న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో డైకాస్ రోడ్ సెంటర్ నందు భవన నిర్మాణ కార్మికులకు ఇతర కార్మికులకు కరపత్రాలు పంచి సమ్మెను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ గౌరవ అధ్యక్షులు కొండా ప్రసాద్, రూరల్ కార్యదర్శి ఎస్కె ఖలీల్ మాట్లాడుతూ.. 12వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని 12 14 మెమోను రద్దుచేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అలాగే భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇంటి నిర్మాణానికి రుణాలు పిల్లలకు చదువులు స్కాలర్ షిప్పులు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలి కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలను ఆపాలి ఈపాటికే శాంక్షన్ చేసి నిధులు ఇవ్వకుండా ఆపేసిన క్లైములకు వెంటనే నిధులు విడుదల చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు రూరల్ నాయకులు ఎస్కె కాజావలి, పి.రత్నం, సిహెచ్ రత్నం, ఎస్కె ఖాదర్, ఎస్.కె అన్వర్, మల్లికార్జున, మహేష్, కార్మికులు పాల్గొన్నారు.

# అపరిష్కృతంగా ఉన్నడ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అడుగులు వేస్తున్నారు. ఆదివారం స్థానిక ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నుండి సుమారు కిలోమీటర్ మేరా కోటి 17లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన స్థానిక ఎంపీపీ వనిపెంటహైమావతి స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ మురుగునీరు ఉండకుండా ఉండేందుకు రానున్న రోజుల్లో పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు ప్రస్తుతం నుడా నుండి 87 లక్షలు ఎంపీపీ గ్రాంట్ నుండి 30లక్షల రూపాయలతో ఈ డ్రైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. గడచిన నాలుగు దశాబ్దాల నుండిఇలాంటి సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆ సమస్య లేకుండా చేస్తానన్నారు. అంతేకాకుండా పట్టణ ప్రజల రవాణా సౌకర్యార్థం సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో పట్టణంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ అనుసంధాన రహదారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అత్యాధునికమైన వసతులతో కూడిన డయాలసిస్ యూనిట్ను అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. దీనివల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా చికిత్స పొందే వీలు ఉంటుందన్నారు. వింజమూరు మండల విద్యా వైద్య రంగాలలో అభివృద్ధి చెందిందని ఇలాంటి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే తన లక్ష్యమని తన ప్రథమ ప్రాధాన్యతని ఆయన తెలిపారు. గడచిన 19 నెలల కాలావ్యవధిలో అనితర సాధ్యమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అంతేకాకుండా ఈ డ్రైన్ నిర్మాణం పూర్తయిన వెంటనే ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం మెయిన్ రోడ్డు నుండి నేరేడుపల్లి వరకు గతంలో బీటీ రోడ్డుగా మంజూరు చేయడం జరిగిందని దీనిని తిరిగి సీసీ రోడ్డుగా నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు అలాగే త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభంకు సిద్ధంగా ఉందన్నారు. స్థానిక బంగ్లా సెంటర్ నుండి బస్టాండ్ వరకు డివైడర్ ఏర్పాటు చేసి సెంటర్ లైటింగ్ పనులు చేయాల్సి ఉందన్నారు అదేవిధంగా వింజమూరు పాతూరు చెరువును ఆధునీకరణ చేసి సుందరంగా రూపుదిద్దుతామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, యువ నాయకుడు విద్యాశాఖామాత్యు నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్రీనివాస్‌రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్ సీనియర్ నాయకులు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి గణపం సుదర్శన్ రెడ్డి, తెలుగుదేశం మండల ఉపాధ్యక్షులు మంచాల శ్రీనివాస్ నాయుడు సర్పంచ్ ఎన్.సుజనా బిజెపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ కదిరి వెంకట రంగారావు జనసేన కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు వింజమూరు బిజెపి మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్ రెడ్డి జనసేన మండలాధ్యక్షుడు బండారు సత్యనారాయణ నాయకులు చల్ల శ్రీనివాసులు యాదవ్ గురజాల గోపి కోడూరు నాగిరెడ్డి గని శ్రీనివాస నాయుడు కర్ణంశ్రీనివాసులు నాయుడు కాటం రమణారెడ్డి పాములపాటి మాల్యాద్రి దొరస్వామి నాయుడు తిరుపతి ఆచారి కంచర్ల శ్రీనివాసులు ఏగినేని శ్రీనివాసులు చేజర్ల భాస్కర్ రెడ్డి జయంత్ రెడ్డి షేక్ రఫీ రేవు నూరిరమణారెడ్డి ఎన్నపల్లి పెంచలరావు కె.వి రత్నం షేక్ మస్తాన్ బి పెంచల్ రెడ్డి కటకం ప్రసన్నకుమార్ నీలం పెరుమాళ్ల రామకృష్ణ రమణయ్య మహేంద్ర ప్రసాద్ డి ప్రసాద్ ఇతర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# మెడికవర్ వైద్యశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన 3కే వాక్

**కావలి, మేజర్‌న్యూస్ :** క్యాన్సర్ పై అవగాహన పెంచుతూ ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలపై చైతన్యం తీసుకురావాలని ప్రధాన లక్ష్యంతో కావలి పట్టణంలో మెడికవర్ హాస్పిటల్ త్రీ కె వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు మెడికవర్ వైద్యశాల, కావలి ఐఎంఏ, సేవియర్ వాలంటరీ ఆర్గనైజేషన్, నలంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ క్యాన్సర్ అవగాహన ర్యాలీ భారీగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కావ్య హాజరై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నడిచారు. ఈ కార్యక్రమం కావలి ఆర్టీఓ కార్యాలయం నుండి విట్స్ కాలేజీ గ్రౌండ్ వరకు సాగినది వైద్యులు విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మహిళలు యువత పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్ట్యూట్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై ప్రజలకు విస్తృత అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ స్థాయిలో క్యాన్సర్ అవగాహన వాక్‌తోపాటు ప్రజలతో ప్రత్యక్షంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో వైద్య నిపుణులు మాట్లాడుతూ, భారత్లో ప్రతి సంవత్సరం 14 లక్షలకు పైగా కొత్త క్యాన్సర్ వ్యాధి కేసులు నమోదు అవుతున్నాయని, వీటిలో అధిక శాతం కేసులు ఆలస్యంగా గుర్తించడం వల్ల ప్రాణాపాయం జరుగుతుందని వివరించారు. అయితే సమయానికి వైద్య పరీక్షలు చేయించుకుంటే ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు. డాక్టర్ జి.రంగ రామణ్ సీనియర్ అంకాలజిస్ట్, డాక్టర్ ఎం.రమేష్ బాబు సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్టు




మాట్లాడుతూ.. ఆధునిక కీమోథెరపీ, టార్గెటె డ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి చికిత్సలతో క్యాన్సర్ ఫలితాలు ఘననీయంగా మెరుగైనప్పటికీ, అవగాహన ప్రారంభ దశలోనే నిర్ధారణే ప్రధాన ఆయుధం, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రారంభ దశలో గుర్తించిన క్యాన్సర్‌ను శస్త్ర చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని ముఖ్యంగా 40 సంవత్సరాల పైబడిన వారు బ్రెస్ట్, వరల్, సర్వైకల్ క్యాన్సర్, స్క్రీనింగ్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని అపోహలను తొలగించడమే మా లక్ష్యం, అవగాహన సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చు నని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మహాసభ




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు రీజియన్ 2వ ద్వైవార్షిక మహాసభ ఆదివారం నెల్లూరు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ మహాసభకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెల్లూరు రీజియన్లలో పని చేస్తున్న సుమారు 250 మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశాన్ని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ ఉదయ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020 ఏప్రిల్1న మూడు బ్యాంకులు విలీనం అయిన తరువాత ఉద్యోగులకు సంబంధించిన పాలసీల్లో ఉత్తమ విధానాలను అమలు చేయగలిగామని, స్టాఫ్ వెల్ఫేర్, స్టాఫ్ లోన్స్ తదితర అంశాలలో ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడామని తెలిపారు. మార్చి 8, 2024న ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్,యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ మధ్య కుదిరిన 12వ ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం బ్యాంకు ఉద్యోగులకు 5 రోజుల పని దినాలు అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. 29 లేబర్ కోడు 4 లేబర్ కోడ్స్ మార్చడం పూర్తిగా కార్మిక వ్యతిరేక చర్యగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 12న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ సమ్మెలో ఏఐబిఈఏ కూడా పాల్గొంటుం దని, అందరూ సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నెల్లూరు రీజియన్ డిప్యూటీ రీజినల్ హెడ్స్ వేణుగోపాల్, శివశంకర్, ఏపీయుబీఈఏ అధ్యక్షులు కామ్రేడ్ కాలే శ్రీనివాస రావు, చైర్మన్ కామ్రేడ్ విజయ్ భాస్కర్, ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ లక్ష్మీపతి రావు, కార్యదర్శి కామ్రేడ్ శ్రీనివాస్, కోశాధికారి కామ్రేడ్ సుమన్, కామ్రేడ్ మృదుల, కామ్రేడ్ స్వాతీ మహిళా కౌన్సిల్ నాయకులు తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొనడం మరో విశేషం.

# టీఎన్‌టీయుసీ అధ్యక్షుడిగా తిన్నెలపూడి సిద్దు

**అభినందించిన మండల టీడీపీ నాయకత్వం**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో బీసీ సామాజిక వర్గానికి మరోసారి కీలకమైన పదవిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కేటాయించారు. ఆ పార్టీలో సామాజిక వర్గం నుంచి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేసిన పంటపాలెం గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ బీసీ నాయకులు తిన్నెలపూడి సిద్దుకు మండల స్థాయిలో ప్రతిష్టాత్మకమైన పదవి చేకూరింది. తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా నియమిస్తూ స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి ఆమోదముద్ర వేశారు. ఆదివారం మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ అధికారికంగా టీఎన్‌టీయుసీ కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడు తిన్నెలపూడిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా ప్రసాద్ రెడ్డి, చరణ్ తేజ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాజేష్, పట్టపు నరసింహులు



సంయుక్తంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు నీలం మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వంతోపాటు శాసనసభ్యులు సోమిరెడ్డికి మంచి పేరు తీసుకొస్తూ కార్మిక సమస్యల పైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తుందని ఈ విషయాన్ని గుర్తుతెచ్చుకొని పరిశ్రమల అధికారులతో కూడా మంచి సంబంధాలు కలిగి ఉంటూ కార్మికులకు అండగా నిలవాలని తెలియజేశారు. టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు సిద్దు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి మంచి పేరు తీసుకొస్తామన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించే విషయంలో పరిశ్రమల యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దీనయ్య, బీసీ నాయకులు ముత్యం గౌడ్, మత్స్యకార విభాగం కమిటీ అధ్యక్షుడు ఏడుకొండలు, ఐ టీడీపీ అధ్యక్షులు సతీష్ నాయుడు, నాయకులు మైనుద్దీన్, వెంకటరమణయ్య నాయుడు ,వివిధ అనుబంధ సంఘాల కార్యవర్గం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి పెద్ద హుండీ బహుకరణ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట లోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దాత బడి చంద్రశేఖర్‌రెడ్డి ఒక కొత్త మొక్కుబడి కానుక పెద్ద హుండీని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంకు సమర్పించారు. కొత్త హుండీకి పూజా కార్యక్రమాలు జరిపి దేవదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు కమిటీ ఛైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు, అర్చకులు, దాతలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా పైపులైను పనులకు శంకుస్థాపన



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి వైకుంఠపురం పెద్ద పావనిరోడ్‌లో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర 15వ ఆర్థిక సంఘం నిధుల కింద ఆదివారం 23.5 లక్షల అంచనాతో తాగునీటి సరఫరా పైపులైను పనులకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ నూతనంగా నిర్మించబోతున్న పైపులైను వలన 31, 35, 36,38 వార్డుల ప్రజలకు నీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పైపు లైను నిర్మించినట్ల యితే కావలి మున్సిపాలిటీకి చాలా ఆదాయ వనరులు మిగులుబడ ఉంటుందని తెలిపారు. ఎందుకంటే ట్యాంకర్ల వలన ప్రతి నెల ఎన్నో లక్షల వ్యయంతో మున్సిపాలిటీ నిధులు ఖర్చు అవుతున్నాయని, ఈ పైపు లు పైపులైను నిర్మాణం జరిగితే ట్యాంకర్ల నీటి అవసరత ఉండదని తెలి పారు. ఈ కార్యక్రమంలో కావలి టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ పి.సాయిరాం, అసిస్టెంట్ ఇంజనీర్ టి.నోద్ కుమార్ మున్సిపల్ వార్డు సిబ్బంది, టీడీపీ ఇన్‌చార్జ్‌లు ప్రజలు పాల్గొన్నారు.

## రమాబాయి అంబేద్కర్ జయంతిని

## మహిళా దినోత్సవం ప్రకటించాలి : బిటీఏ




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం త్యాగమై రమాబాయి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మయ్య జిల్లా అధ్యక్షులు మణి సుబ్బు మాట్లాడుతూ.. రమాబాయి తన కడుపున పుట్టిన నలుగురు బిడ్డలు చనిపోయి కూడా భారత దేశంలో పిల్లలందరూ తన బిడ్డలుగా భావించిన ఆమహాతల్లి అని వారు ఈ దేశంలో అత్యుత్తమ మహిళగా గుర్తింపు పొందాలని తెలిపారు. డా. అంబేద్కర్ ఈ దేశానికి ఒక మహనీయుడుగా మారడంలో అనునిత్యం ఆమె సహకరించిన విధానం ప్రతి కష్ట కాలంలో ఆమె యొక్క ప్రోత్సాహమే ప్రధానమని తెలిపారు. కాబట్టి ఇలాంటి మహిళా జయంతిని మహిళా దినోత్సవంగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిటీఏ నాయకులు జనార్ధన్, మనోహర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మోటివేషన్ తరగతులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం విశ్రాంత సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, స్టూడెంట్ మోటివేటర్‌గా పేరుగాంచిన తెలుగు భారతి సేవాసమితి ప్రతినిధి వెలిశెట్టి నారాయణరావు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. 75మంది విద్యార్థులకు ఆయన తరగతులు నిర్వహించి అభ్యాసం గురించి, సులభతరంగా పరీక్షలకు సిద్ధం కావడం గురించి, శ్రద్ధాసక్తులతో అభ్యశించే అంశం తదితరాలను గురించి ఆయన విద్యార్థులకు బోధించారు. ఈపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పోతులూరయ్య ఆహ్వానం మేరకు గణిత ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు నారాయణరావు విక్షణ ఇచ్చారు. ఇటీవల ఉద్యోగవిరమణ గావించినా సేవాభావంతో విద్యార్థులకు బోధనగావిస్తున్న సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు పార్లపల్లి నాగరాజారావు సహకారమందించారు. నారాయణరావు విద్యార్థులకు పాఠ్యాంశాలు, అభ్యాసంలో పాటించాల్సిన విధానాలు గురించి వివరించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఏవిధంగా సిద్ధం కావాలనే విషయమై ఆయన నిశితంగా వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని, శ్రద్ధ,పట్టుదలతో అభ్యశించి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను గురించి ఆయన వివరించారు. మొక్కవోని సంకల్పబలంతో ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని అడుగడునా అవరోధాలను ఎదుర్కొని అసాధ్యాలను సుసాధ్యం చేసి తమ సత్తాచాటి ఎందరికో ఆదర్శంగా నిలిచిన పలువురి నిజజీవిత విశేషాలను నారాయణరావు వివరించి అందరిలో స్ఫూర్తినింపేలా సూచనలు చేశారు. విద్యార్థులు నారాయణరావు అందించిన అవగాహనపట్ల బాగా స్పందించారు. నారాయణరావు తాను ఉపాధ్యాయుడుగా ఉన్న కాలంలో అత్యంత అంకితభావం, చిత్తశుద్ధి, క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుడుగా పేరుగాంచారు. ఆయన అత్యంత



విజ్ఞానవంతుడు, ఉపన్యాసకుడే కాకుండా చిత్రలేఖనంలో అత్యంత ప్రవీణుడు. విజ్ఞానఖనిగా మేధావిగా పేరుగాంచారు. ఆయన ఉద్యోగ విరమణ గావించినా సేవానిరతితో విద్యార్థులకు తమవంతుగా సేవలందించాలన్న తలంపుతో ఇప్పటివరకు 577 మోటివేషన్ తరగతులు నిర్వహించి వేలాదిమంది విద్యార్థులకు సేవలందించారు. తెలుగు భారతిసేవాసమితి ప్రతినిధిగా తెలుగుభాషను కాపాడుకునేందుకు తనవంతుగా కృషి సాగిస్తుంటారు. ఆత్మకూరులో నిత్యాన్నదాత, శ్రీసాంబశివచారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ చేస్తున్న నిత్యాన్నదానం, ఇతర సామాజికసేవా కార్యక్రమాల్లో నారాయణరావు భాగస్వామ్యులవుతూ తనవంతుగా సేవలందిస్తుంటారు. ఆయన నిర్వహించే మోటివేషన్ తరగతుల పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతగానో సంతృప్తిచెందుతూ ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతుంటారు. ఆయన అందిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతుంటారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి, అనంతరం చేస్తున్న సేవలతో ఆయన జీవితానికి సార్థకత చేకూరిందని సర్వత్రా భావిస్తున్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనిశ్రీ వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి పంచేటి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ అమెండ్మెంట్ యాక్ట్ వచ్చిన తర్వాత పోలీస్ అధికారులు ఆటోలపై విధించే పెనాల్టీ వంద రూపాయలు నుంచి ఐదు వందల రూపాయల వరకు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. డీజిల్, పెట్రోలియం ఉత్పత్తులు జీఎస్టీ పరిధిలోకి తీసుకొస్తే ఆయిల్ ధరలు తగ్గి ఆటో కార్మికులకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉన్నందున ప్రభుత్వశీ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 21 తక్షణమే రద్దు చేయాలని పిలుపునిచ్చారు కేరళ తమిళనాడు రాష్ట్రాల్లో మాదిరి ఆటో కార్మికులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా ఆటో కార్మికుల ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ ఉచిత బస్సు పథకానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదని, కానీ నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని, ఆర్థిక సహాయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 12వ తేదీ జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు ఆటో కార్మికులందరూ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి కుంచం రత్నగిరి, అధ్యక్షుడు కొండిపాకు పెంచలయ్య, ఉపాధ్యక్షుడు మగ్గం హేమంత్, మండల సిఐటియు నాయకులు చింతగుంట శ్రీనివాస్, ఆటో యూనియన్ కార్మికులు విష్ణు, శంకర్, చలపతి, రవీంద్ర, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కులగణన కల నెరవేరేనా..

- కార్యాచరణ అడుగులు ముందుకు పడేనా
- దశాబ్దాల నాటి బీసీల పోరాటానికి అడుగడుగునా అడ్డంకులు
- హోం మంత్రి హామీ ఇచ్చినా ముందుకు సాగని కార్యాచరణ
- కులానికో కోడ్ ఇస్తే బాగుంటుందంటున్న విశ్లేషకులు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బీసీ కులగణనపై దశాబ్దాల కాలం నుంచి చేస్తున్న అలుపెరుగని పోరాటాల ధాటికి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన కూడా చేస్తామని ప్రకటించింది. అయితే 2027లో జనగణనతోపాటు కులగణనను కూడా చేపట్టడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన షెడ్యూల్లో పేర్కొనడాన్ని బీసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి జనగణనతోపాటు కుల గణన కూడా చేపట్టే విషయంలో కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఇదొక రహస్య అజెండాగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని బీసీ సంఘాలు చెబుతున్నాయి. మార్గదర్శకాలు రూపొందించ చడంలోనూ, సమగ్ర డేటా సేకరణ లోను, వెంటాడుతున్న వరుస వైఫల్యాలు, వృత్తిపరమైన నైపుణ్యం లేకపోవడం ఇతరత్రా అడ్డంకులు వెరసి బిసి కులగణన జాప్యం అయ్యేందుకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారణమవుతున్నాయని, దీనిని బట్టి చూస్తే అసలు బీసీ కులగణన కల నెరవేరేనా, అన్న సందేహాలు కలుగుతున్నట్లు విశ్లేషకులు తమ తమ అభిప్రాయాలు వెలుబుచ్చుతున్నారు. నియోజకవర్గాల ప్రక్రియ యాదృచ్ఛికం కాకపోయినప్పటికీ 2026లో ప్రారంభం కావాల్సిన జనగణనతోపాటు కులగణన చేపట్టే ప్రక్రియలు 2027 వరకు వాయిదా పడే అవకాశాలు ఉండడం బీసీలను మరింత ఆందోళన కలిగిస్తుంది. కులగణనను 2027లో కాకుండా 2026లోనే చేపట్టి చట్ట సవరణ చేసినట్లయితే బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2026 అక్టోబర్ 1 నుంచి జమ్మూ కాశ్మీర్, లడక్ ఉత్తరాఖండ్, హిమాచల ప్రదేశ్‌లలో తొలి విడత బీసీ కులగణనను ప్రారంభించిన తర్వాత 2027 మార్చి 1 నుంచి రెండవ దశలో దేశమంతటా బీసీ కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా చేయడం వల్ల నియోజక వర్గాల పునర్విభజనకు ఎంతగానో దోహదపడే అవకాశాలు ఉన్నప్పటికీ, జనాభా నియంత్రణ విధానాలను కచ్చితంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు డి-లిమిటేషన్ ప్రక్రియ వల్ల పార్లమెంట్ సీట్లు కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమనే అభిప్రాయాలు పరిశీలకుల నోటి వెంట వ్యక్తమవుతున్నాయి. జనాభా నియంత్రణ గురించి ఏమాత్రం పట్టించుకోని పలు రాష్ట్రాలు అదనపు సీట్లను బహుమతిగా పొందడం ఎంత వరకు సబబు, ఇది ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే ప్రక్రియ కాక మరేమిటి, అన్న అంశాలపై బీసీ సంఘాల్లో సర్వత్రా చర్చలు సాగుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరిగేలా డి-లిమిటేషన్ విధానాన్ని రూపొందించాలని అంశంపై సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినప్పటికీ స్పష్టమైన విధానం అవసరత కాయలు కార్యాచరణలో కూడా స్పష్టత రావాల్సి ఉందని అభిప్రాయాలు యావత్ బీసీ కుల బంధువులు బాంధవులు సంఘాల నాయకులు నుంచి వ్యక్తమవుతున్నాయి ఇదే క్రమంలో కుల గణనలో సాంకేతిక పదాలు ఉపయోగించాల్సిన అవసరం లేకపోయినప్పటికీ కులం అనే పదాన్ని స్పష్టంగా చేర్చాల్సిన ఆవశ్యకత ఉందని ఇలాంటి చర్యల వల్ల బీసీలకు సామాజిక న్యాయం రిజర్వేషన్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల కేటాయింపుల్లో కుల ఆధారిత డేటాకు చట్టపరమైన విశ్వసనీయతను తీసుకొచ్చే అవకాశం ఉంటుందని జాతీయ బీసీ దళ్ నాయకులు సైతం తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

## వెంటాడుతున్న వృత్తి నైపుణ్య లోపం..

గతంలో కాంగ్రెస్ సోషియో ఎకనామిక్ ద్వారా కుల గణన చేపట్టినప్పుడు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ డెవలప్ మెంట్, గ్రామీణ ప్రాంతాల్లో రూరల్ డెవలప్ మెంట్ శాఖ ఆధ్వర్యంలో జరిగేవి. ఈ క్రమంలో ఆయా శాఖల ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యత లేకపోవడంతో డేటా మొత్తం తప్పుల తడకగా మారిందనే అపవాదులు మూటగట్టుకుంది. గణనలో ప్రతి కులానికి సంబంధించి ఓ కోడ్ నెంబర్ ఇవ్వడం వల్ల కులాలన్నీ కలిసిపోయి డేటా స్వచ్ఛత దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రాల వారిగా కులాలు జాబితాను తయారు చేయడంతోపాటు వాటికి కోడ్ నెంబర్ కేటాయింపుతో పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయడం మంచి ఆలోచన. కుల గణన ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బీసీలకు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లను దామాషా ప్రకారం పెంచాల్సి ఉంటుంది.ఇలా చేయడం వల్ల నిజమైన సామాజిక న్యాయం సాధ్యమ వుతుందన్న భావన విశ్లేషకులు నుంచి వ్యక్తం అవుతుంది. జనగణనతోపాటు కులగణన చేపట్టే ప్రక్రియల్లో స్థానిక భాషలు, సామాజిక సమూహాల సమాచారాన్ని సక్రమ రీతిలో నమోదు చేయడానికి సమగ్రమైన మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉన్నప్పటికీ, వెంటాడుతున్న వృత్తి నైపుణ్య లోపం వల్ల వెనుకంజలో ఉన్నట్లు తెలుస్తోంది. సెన్సెస్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో జరిగే కులగణనలపై మేధావులతో చర్చించిన మీదట సమగ్ర విధానాలను రూపొందించి డేటా సేకరణలో సరైన చర్యలు గోప్యతా పరమైన ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. శిక్షణ పొందిన సెన్సెస్ డిపార్ట్ మెంట్ అధికారుల ద్వారా కులగణన జరిగితేనే, ఆ ప్రక్రియకు విశ్వసనీయత ఏర్పడుతుందన్న అభిప్రాయాలు యావత్ బీసీ కుల బాంధవులు, కుల సంఘాల నాయకుల నుంచి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### కులగణన త్వరితగతిన చేపట్టాలి

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు**



తెలంగాణ తరహాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా కులగణన ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలి. ఆ తర్వాతనే లోకల్ బాడీ ఎన్నికలు జరిగితే బాగుంటుందని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు పేర్కొన్నారు. ఎన్నికల ముందే కులగణన జరపడం వల్ల పూర్తిస్థాయిలో డేటా అందుబాటులోకి వస్తుందని, కులగణన త్వరితగతిన పూర్తి చేయడం వల్ల అన్ని కులాల తోపాటు బీసీల్లో కూడా విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలకు తగిన ప్రాధాన్యత క్రమంతో రిజర్వేషన్ల వర్తింపు ద్వారా నూతన ఉత్సాహం పెరుగుతుందని, తదుపరి ఎలక్షన్లలో ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రశాంతంగా జరుపుకునే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### ఖచ్చితమైన గణాంకాలు ఉండాలి..

**సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య**



మన దేశ రాజకీయ అభివృద్ధి ప్రక్రియలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలంటే జనాభా సామాజిక స్థితిగతులపై ఖచ్చితమైన గణాంకాలు తప్పనిసరి అన్న వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాల్సిన అవ సరం ఉందని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య యాదవ్ పేర్కొన్నారు. నియోజక వర్గాల ప్రక్రియ యాదృచ్ఛికం కాకపోయినప్పటికీ 2026లో అక్టోబర్ 1న ప్రారంభం కావాల్సిన జన గణన తోపాటు కులగణన ప్రక్రియలు 2027 వరకు వాయిదా పడే అవకాశం ఉండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. బీసీ కులగణనను 2027లో కాకుండా 2026లోనే చేపట్టినట్లయితే అన్ని రంగాల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుంద న్నారు. ఈ దశగా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

# లేబర్‌కోడ్‌ల నష్టాన్ని అందరూ గుర్తించాలి

● కార్మికచట్టాలను కాపాడుకోవాలి ● ఈతనెల12న సమ్మెను సయప్రదం చేయాలి ● సీఐటీయు రాష్ట్ర నేత అజయ్‌కుమార్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల నష్టాన్ని అందరూ గుర్తించాలని, రద్దుచేసిన 29 కార్మికచట్టాలను కాపాడుకోవాలని, అందుకోసం ఈనెల12వతేదీన నిర్వహించనున్న సమ్మెలో అందరూ అధికంగా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గసభ్యులు కటారి అజయ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సమ్మెసమాయత్త సమావేశం నిర్వహించగా అతిధిగా అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. బ్రిటిష్‌హయాంలో కార్మికులు పోరాటాలు చేసి వారి మెడలువంచి 29కార్మికచట్టాలను సాధించుకున్నారన్నారు. కానీ కేంద్రప్రభుత్వం ఈచట్టాలను మార్చి నాలుగు లేబర్‌కోడ్‌లను రూపొందించిందన్నారు. ఈ కోడ్‌లు ఎవరికి అనుకూలంగా ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. నాడు స్వాతంత్ర్య పోరాటంలో సమ్మె చేసే హక్కు అనే నినాదం మార్మోగిందని ఆయన పేర్కొన్నారు. 1917లో 8గంటల పని చేసే హక్కును సాధించుకుంటే నూతన కోడ్‌లతో 10నుండి 12గంటలు పనిచేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఈనెల12వతేదీన కార్మికసంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాపిత సమ్మె తలపెట్టామని, ఈసమ్మెలో అధికంగా కార్మికులు, ఉద్యోగులు, సిఐటియు , అనుబంధ సంఘాల శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకుడు జి.వి.శిప్రసాద్ ప్రసంగిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల12వతేదీన ఆత్మకూరులో పెద్ద ఎత్తున కార్మికులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులోభాగంగా ఈనెల10వతేదీన 12వతేదీ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పెద్దఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్మికులను, రైతులను, ప్రజలను సమ్మెకు సమాయత్తం చేసి పెద్ద ఎత్తున 12వతేదీన సార్వత్రిక సమ్మెలో అందరూ అధికంగా పాల్గొనేలా




చైతన్యపరుస్తామని శివప్రసాద్ పేర్కొన్నారు.ఆత్మకూరులో ఇప్పుడున్న కార్మికులకు కనీసవేతనాలు అమలు కావడం లేదన్నారు. నూతన చట్టాలు అమలులోకి వస్తే పూర్తిగా హక్కులన్నీ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేస్తూ ఈ డిమాండ్ల సాధనలక్ష్యంగా ఈనెల12న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని శివప్రసాద్ కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు చంద్రా రాజగోపాల్, వ్యవసాయకార్మికసంఘ జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిఐటియు జిల్లా నాయకుడు కొండమూరి హజరత్తయ్య, సిఐటియు మండల కార్యదర్శి ఏ.మహేష్, ఎల్ఐసి యూనియన్ నాయకుడు టి.రమేష్, విద్యుత్ ఉద్యోగసంఘ నాయకుడు పెంచలరావు, అంగన్‌వాడీలయూనియన్ ప్రాజెక్టుకమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ, అధ్యక్షురాలు కె.రమణమ్మ, ఆశాకార్యకర్తలు, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర, ఆళ్ళ హజరత్తయ్య, మస్తానయ్య, జిలాని, మున్సిపల్ యూనియన్ నాయకుడు గురవయ్య, వివిధ యూనియన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనకారులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి : ఎస్ఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వాహనకారులు డ్రైవింగ్‌లో తగు జాగ్రత్తలు పాటించాలని, రవాణా నియమావళి అనుసరించాలని ఆత్మకూరు ఎస్ఐ షేక్ జిలానీ సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతూ పలువురు మృత్యువాతబడడం, పలువురు క్షతగాత్రులు కావడం నేపద్యంలో ఆదివారం ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లా ఎస్‌పి అజితవేజెండ్ల ఆదేశాలమేరకు స్థానిక డిఎస్‌పి కె.వేణుగోపాల్ మార్గదర్శకత్వంలో సిఐ గంగాధర్ పర్యవేక్షణలో ఎస్ఐ జిలానీ ఆదివారం అనేక వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు సమక్రమంగా ఉన్నాయా, హెల్మెట్లు ధరించారా అనే అంశాలను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. ప్రజలు వాహనాలను నడిపేసమయంలో రోడ్డుభధ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అప్రమత్తంగా ఉండాలని ఆయన వాహనకారులకు సూచించారు. ద్విచక్ర వాహనకారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని ఆయన సూచించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయన వాహనాలను తనిఖీచేయడం తోపాటు వాహనకారులకు తగిన అవగాహన కల్పించారు. దాదాపు 300 వాహనాలను ఆయన తనిఖీ చేశారు. డ్రైవింగ్ పట్ల, ట్రాఫిక్ పట్ల ఆయన అందరికీ అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని, తమవంతుగా అత్యంత జాగ్రత్తలతో వాహనాలను నడపాలని ఆయన సూచించారు.రోడ్డుభధ్రతా నిబంధనలు తప్పకుండా పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉండాలని, సెల్‌ఫోన్‌లు వినియోగించరాదని ఆయన సూచించారు.

# ఏపీజీఈఏ నెల్లూరు రూరల్ యూనిట్ ఎన్నికలు ప్రశాంతం

● ఉద్యోగులంతా సమన్వయంతో ? అభ్యర్థుల ఏకగ్రీవం
● అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసులు, సురేష్
● ఎన్నికల అధికారులు ఎం.సురేష్, విద్యాసాగర్‌రెడ్డి వెల్లడి




**నెల్లూరు/వేదాయపాలం, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరం నందు ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నెల్లూరు రూరల్ తాలూకా యూనిట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారి ఎం.సురేష్, సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కె.విద్యాసాగర్ రెడ్డిలు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో నెల్లూరు రూరల్ తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా పోటీ చేసిన ఆర్.శ్రీనివాసులు, జె.సురేష్ ఎన్నికయ్యారు. నెల్లూరు రూరల్ తాలూకా యూనిట్ ఉద్యోగులంతా ఎక్కతాటిపైకి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్న ఈ ఎన్నికలలో సహాధ్యక్షులుగా జి.శరవణ్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.శ్రీనివాసులురెడ్డి, కోశాధికారిగా కె.సుమతిలు ఎన్నికకాగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు బీ.పెంచలయ్య, ఎస్‌కె. ముజాహిద్దీన్, ఎన్.వెంకటయ్య, పి.ఉమారాణి, టి.సార్మడి, జి.పెంచల రామిరెడ్డి, ఎస్.జ్యోతి ఉపాధ్యక్షులుగా, సంయుక్త కార్యదర్శులుగా బి.రాజా నవీన్ కుమార్, ఏ.కుమారి, ఏ.రాజేష్, బి.స్వర్ణలత, ఎస్ కె జబీన, శైలసుధ, ఎస్.కె ఆర్య రిజ్వాన తదితరులంతా అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏపీజీఈఏ రాష్ట్రమాజీ సహాధ్యక్షుడు చొప్పా రవీంద్రబాబు, రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు బి.సుధాకరరెడ్డి కార్యదర్శి పీవీఎస్‌టీ రామ్ ప్రసాద్ తదితరులు శుభాభినందనలు తెలిపారు.

# గర్భిణీలు, బాలింతలకు కంచి ప్రత్యేక గది ఏర్పాటు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో మానవత్వానికి మకుటంగా నిత్యాన్నదాత, శ్రీసాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డి స్పందించారు. స్థానిక మున్సిపల్ బస్టాండు ఆవరణలో గర్భిణీలు, బాలింతలు వేచి ఉండేందుకు తమ బిడ్డలకు పాలిచ్చేందుకు ఒక ప్రత్యేక గదిని ఆయన ప్రారంభించారు. గర్భిణీలు, బాలింతలు బస్టాండువద్ద తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న పరిస్థితిని ఆయన గుర్తించి ఈమేరకు ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని తలంచి ఆదివారం గదిని ప్రారంభించారు. బస్టాండులో ప్రయాణీకులు కూర్చునేందుకే సక్రమంగా కుర్చీలు, బెంచీలు లేక అనేకమంది నేలపైనే కూర్చొని వేచి ఉంటుంటారు. సేవచేసేందుకు సంపదకన్నా సంస్కారం ముఖ్యమన్న నినాదాన్ని ఆయన నిజం చేస్తూ బాగా ఇబ్బందిపడుతున్న గర్భిణీలు, బాలింతలకోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేసి వారికి సౌకర్యం కల్పించారు. వారంతా పరమేశ్వరరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టస్ట్ ప్రతినిధి మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి, తెలుగు భారతిసేవాసమితి ప్రతినిధులు ఎస్.వి.రమణయ్య, సోమవరపు సుబ్బరాయుడు, టి.రమేష్, కొల్లా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలంలో ఇటీవల మృతిచెందిన 8మంది కుటుంబాల వారికి ఆదివారం నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మెన్ కంచిపరమేశ్వరరెడ్డి 10వేల వంతున 80వేల రూపాయలను అందజేశారు. ఆదివారం మురుగుళ్ళ గ్రామంలో ఇటీవల మృతిచెందిన కుక్కపల్లి వెంకటరమణయ్య కుటుంబాన్ని, గొల్లపల్లిలో ఇటీవల మృతిచెందిన ఇర్ల మల్లెంకొండయ్య కుటుంబాన్ని, కరటంపాడుకు చెందిన చెల్లగుంట నరశింహులుకుటుంబాన్ని, రావులకొల్లులో మిట్టా సుబ్బారావు కుటుంబాన్ని, అప్పారావుపాళెంలో యాకశిరి అంకయ్య కుటుంబాన్ని, కొర్రపాటి రమణమ్మ కుటుంబాన్ని, మాణికల తులశమ్మ కుటుంబాన్ని కంచి పరమేశ్వరరెడ్డి పరామర్శించి ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందజేశారు. కంచిపరమేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజికసేవలు అమోఘం, అత్యంత ప్రయోజనకరం, అభినం దనీయం అని సర్వత్రా కొనియాడుతున్నారు. ఆర్థికసాయ మందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టస్ట్ ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో


# మెగా రక్తదాన శిబిరం

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక ధనలక్ష్మీపురంలో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత రక్తదాన ఉద్యమంలో భాగస్వాములయ్యేలా హెల్పింగ్ హాండ్స్ సొసైటీ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకుడు కుంచాల విజయ్ భాస్కర్ ను అభినందించారు. అనంతరం హెల్పింగ్ హాండ్స్ సొసైటీ అధ్యక్షులు కుంచాల విజయభాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ వంతుగా రక్తదాన ఉద్యమంలో పాలుపంచుకుంటూ మెగా రక్తదాన శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. సుమారు 151 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నోవా బ్లడ్ బ్యాంకు ప్రతినిధి మోపూరు భాస్కర్ నాయుడు, టిడిపి నాయకులు తనుజా పలువురు నేతలు పాల్గొన్నారు.

### కావలి ఆర్టీసీ బస్టాండ్‌పై రోజురోజుకు

# ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత

## పట్టించుకోని అధికార యంత్రాంగం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో పారిశుధ్యం పై, ప్రయాణికులకు కనీస వసతులు కూడా కల్పించడంలో అధికారులు విఫల మైనట్లు విశ్వసినియ సమాచారం. ప్రయాణికులైన మహిళలకు మూత్రశాలలు, తాగునీరు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నట్లు ప్రజల నుంచి ప్రయాణికుల నుంచి అధికారులపై తీవ్ర వ్యతిరేకం రోజురోజుకీ పెరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం రోజుకి వేల సంఖ్యలో ఈ బస్టాండ్‌కు ప్రయాణికులు ప్రజలు పిల్లలు విద్యార్థులు వస్తూపోతూ ఉంటారు. కానీ ఇక్కడ కనీస అవసరాలు కూడా పట్టించుకోకుండా ఉన్నత అధికారులు పర్యవేక్షణ కొదవైనట్లు విశ్లేషకులు రాజకీయ నాయకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల శ్రేయస్ కొరకు మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఇవ్వడం వల్ల వృద్ధులు, మహిళలు, పిల్లలు ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. ఇటువంటి వారికి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆవరణలో ఉన్న వ్యర్థాలు అపరిశుద్ధతను బట్టి వ్యాధులు ప్రభులే అవకాశం ఉంది ఈ వ్యాధులు ప్రబులితే వారి ఆరోగ్యం పరిస్థితి ఏమిటి అని ప్రశ్నార్థకంగా మారింది. బస్సులు బయటకు మార్గాన్ని కొన్ని కారణాల వలన మూసివేయడం జరిగింది. ఆ మార్గం ద్వారా పోవున్నప్పుడు, వచ్చినప్పుడు ఆదివారం వృద్ధ మహిళకు ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే వ్యాపారస్తులు అధిక సంఖ్యలో అద్దెలు ఆర్టీసీకి చెల్లించాలి. వారి పరిస్థితి ఏమిటి అనేది వ్యాపారస్తులు తమ బాధను వ్యక్త పరుస్తున్నారు. కలెక్టర్, రాజకీయ నాయకులు జోక్యం చేసుకొని ఆర్టీసీ బస్టాండ్ పారిశుద్ధ్యం కనీస వసతులు వ్యాపారస్తు లకు కలుగుతున్న అసౌకర్యానికి శ్రద్ధ చూపించి ప్రయాణికులకి వ్యాపారస్తులకి ఇబ్బందులు లేకుండా కనీస వసతులు కల్పించాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నారు.

# దొంతాలిలో 40.80 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు

## సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దొంతాలి గ్రామంలో 40.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందని తెలియజేశారు.అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2 కోట్ల 65 లక్షల రూపాయల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా దొంతాలి గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి పనులు ఇంకా ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.అలాగే ఎన్నికలు లేనివేళ గ్రామాలలో జెండాలు అజెండాలు పక్కనపెట్టి అభివృద్ధి పై దృష్టి పెట్టండి. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు మీ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలియజేశారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మల్లినేని వెంకయ్య నాయుడు, నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, జెడ్.పి. కోప్షన్ మెంబర్ అలాబక్షు, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌ఛార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, కో క్లస్టర్ ఇంఛార్జ్ రాపూరు శేఖర్, గ్రామ సర్పంచ్ మల్లినేని రత్నమ్మ, ఎంపీటీసీ చండి అరుణమ్మ, టీడీపీ నాయకులు చండి శంకరయ్య, చండి మురళి, రమణయ్య నాయుడు, రంగయ్య, కృష్ణయ్య, శ్రీహరి, అభిరామ్, వెంకటేశ్వర్లు, చండి సునీల్, బాలు వెంకటరమణయ్య, దయాకర్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన టౌన్ ఏఎస్పీ దీక్ష



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పరిధిలోని బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం రాత్రి నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్పి బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెట్లు, పాత నేరస్తులకు స్వయంగా కౌన్సిలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగకుండా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే పోలీస్ చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని సిసి కెమెరాలు, స్టేషన్ మ్యాప్ పరిశీలించి, పరిస్థితులను ఆరా తీశారు. అదే విధంగా చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో రైటర్, అసిస్టెంట్ రైటర్, కంప్యూటర్ ఆపరేటర్, కోర్టు విధులు, సాధారణ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది విధులను పరిశీలించి ఎవరికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అంతేకాకుండా విసిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, చేంజ్ మ్యాచింగ్ నియంత్రించాలని, మిస్సింగ్, అనుమానస్పద మరణాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలని, దొంగతనం కేసులలో కోల్పోయిన ప్రాపర్టీ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్టేషన్లో నమోదైన కేసులలో దర్యాప్తు వేగవంతం చేయాలని సిబ్బందికి ఈ సందర్భంగా పలు సూచనలు ఆదేశాలు ఏఎస్పీ దీక్ష జారీ చేశారు. కార్యక్రమంలో బాలాజీ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.



# పొగాకు బ్యారన్ దగ్ధం

**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం కృష్ణారెడ్డి పాలెం గ్రామంలో శనివారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది బ్యారన్‌లో పొగాకు అల్లిన 1100 కర్రను క్యూరింగ్ కోసం ఉంచారు. క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తు ఆకు రాలి పడడంతో మంటలు వ్యాపించి బ్యారన్ మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో సుమారు రూ 8 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తోకల నాగమ్మ వాపోయారు. వింజమూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

## ఘనంగా మడియాలయ్య స్వామి ఉత్సవం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకిలో ఆదివారం రజక సోదరులు మడియాలయ్య స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి కులదైవమైన మడియాలయ్య స్వామిని ప్రతి సంవత్సరం తమ వృత్తిలో నిమగ్నం అయ్యే ముందు పూజించు కోవడం ఆనవాయితీ. మకర సంక్రాంతి వరకు కులవృత్తిని నిర్వహించిన రజక కుటుంబాలు వృత్తికి విరామం ఇస్తారు. అనంతరం మంచి రోజు చూసుకుని మడియాలయ్య స్వామిని కొలుచుకొని ఆ పైన తమ వృత్తిలోకి నిమగ్నమవుతారు. ఈ క్రమంలో ఆదివారం స్వామి విగ్రహాన్ని రజక కాలనీ నుంచి ఊరేగింపుగా జలదంకి పెద్ద చెరువు లోని తమ చాకిరేవు వరకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. రంగులు చల్లుకుంటూ బాణాసంచా కాల్చుతూ తమ అభిమానాన్ని చాటుకుంటూ ఆద్యంతం ముందుకు సాగింది. చాకిరేవులో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని నిమజ్జనం చేశారు. అక్కడ నుంచి రజక కుటుంబాలు గ్రామ దేవత పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టి తమ భక్తి ప్రవర్తలను చాటుకున్నారు. కార్యక్రమంలో ఒంగోలు అనీలు, కామేపల్లి మణికంఠ, ఒంగోలుశ్రీనివాసులు, ఒంగోలు మదన్, ఒంగోలు మాల్యాద్రి వింజమూరు రవీంద్ర వింజమూరు మాధవరావు, కుమ్మగిరి నరేష్, వింజమూరు మధు, జలదంకి రజిక కుటుంబ సభ్యుల పాల్గొన్నారు.

## వైభవంగా సాయిబాబా సత్సంగ మహోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్ర మైన ఏఎస్ పేటలో ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం సాయిబాబా సత్సంగ మహో త్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయిబాబా మందిరం అంతట ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సాయిబాబా నామస్మరణంతో భక్తులు భజన చేశారు.అలాగే మధ్యాహ్నం, భారీ అన్న ప్రసాదం విని యోగం చేశారు. రాత్రికి సాయిబాబా చిత్రపటంతో గ్రామ పురవీధుల్లో భక్తులు కోలాటాలతో పల్లకి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మందిరంలో సాయి హారతితో సత్సంగ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజలు, సాయి బాబా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పంచామృత అభిషేకాలు తిరుప్పావడ సేవ



**నెల్లూరు రూరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం, నరసింహకొండ పై వేదగిరి క్షేత్రంగా వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు ఆదివారం అనగా తేదీ 08.01.2026 స్వాతి నక్షత్రం విశేష పర్వదినం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు, తిరుప్పావడ సేవ నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. ముందుగా స్వామివారి మూలవరులకు విశేషంగా పంచామృతాలతో వేదమంత్రాలతో వైఖానస ఆగమానుసారంగా దేవస్థానం ముఖ్య అర్చకులు అర్చకం మాధవగిరి భాస్కరాచార్యులు, అర్చక స్వాములు మాధవగిరి కృష్ణమా చార్యులు, మాధవగిరి రాఘవాచార్యులు, మాధవగిరి అప్పలాచార్యులు అభిషేకాలు నిర్వహించారు. తదుపరి తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా జరిగిన తిరుప్పావడ సేవలో నెల్లూరు శబరి శ్రీరామక్షేత్రము ఎదురుగా శ్రీ వేంకట సర్వ సిద్ధి కాల లక్ష్మీ నరసింహ స్వామి పీఠం వ్యవస్థాపకులు ముఖ్య స్వామి సాయి స్వామి నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ సుదర్శన నారసింహ హోమముల, వారి శిష్య బృందం సభ్యులు శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామివారికి మర్యాదలు సమర్పించుకొని తిరుప్పావడ సేవలో పాల్గొన్నారు. అభిషేక కార్యక్రమములో నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము మాజీ ధర్మకర్త అళహరి విజయ కుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.